
# ఆర్తగీతం

నా గురించి తెలియని వారెవరూ ఉండరు. అలాగని నా దగ్గరకు రావడానికి ఎవరూ ఇష్టపడరు. అయినా అందరూ ఎప్పుడో ఒకప్పుడు నా దగ్గరకు రాక తప్పదు. వచ్చినవాళ్లు నా దగ్గరే ఉండిపోవాలని అనుకోరు. ఎంత త్వరగా వెళ్లిపోదామా అనుకుంటారు.




నన్ను మెచ్చుకునేవాళ్ళూ వుంటారు. నొచ్చుకునేవాళ్ళూ ఉంటారు. కొందరు నాకు కృతజ్ఞతలు చెబుతారు. కొందరు నన్ను కోప్పడతారు.

నేను దాదాపు ప్రతి ఊళ్లో వున్నాను. కొన్నిచోట్ల పెద్దగా ఉంటాను. చాలాచోట్ల చిన్నగా ఉంటాను.

నేను ఆసుప్రతిని.

ఒకప్పుడు నన్ను 'ధర్మాసుపత్రి' అనేవాళ్లు. ఇప్పుడు కూడా అలా అనేవాళ్లు అక్కడక్కడా లేకపోలేదు. ఇప్పుడెక్కువమంది నన్ను గవర్నమెంటాసుపత్రి అనే అంటున్నారు. తెలంగాణా ప్రాంతాల్లో నన్ను సర్కారు దవాఖానా అంటారు. నామీదోపాట కూడా కట్టారు 'నేను రాను బాబోయ్ సర్కారు దవాఖానకు' అంటూ.

నేను మందుల వాసన కొడతానని నన్ను చాలామంది ఏవగించుకుంటారు. ఆ మందులే లేకపోతే రోగాలెలా తగ్గుతాయి చెప్పండి. నేను అపరిశుభ్రంగా ఉంటానని చాలామంది ముఖం అదోలా పెడతారు. నేసలా వుండడానికి కారణమెవరో మీకు మాత్రం తెలియదా?

నేను అవినీతికి నిలయమని అంతా నన్ను అసహ్యించుకుంటారు. అన్నిచోట్లా ఉన్నట్టే అవినీతి ఇక్కడా వుంది. తమకు ప్రత్యేక శ్రద్ధ చూపాలనో బెడ్ ఖాళీ లేకపోయినా ప్రత్యేకంగా వేరే బెడ్ వేయించాలనో మొదట్లో మా డాక్టర్లకూ సిబ్బందికీ మీరే డబ్బాశ చూపారు.

నా దగ్గర జరుగుతున్న అవినీతిని నేను వెనకేసుకొస్తున్నాననుకోకండి. అవినీతిపరుల్ని చూస్తూ నేను బాధపడుతూనే ఉంటాను. అంతకంటే ఎక్కువగా రోగుల్నీ వాళ్ల మూలుగుల్నీ రోదనల్నీ చూసి మరీ బాధపడతాను.

ఒకోసారి విరక్తి కలుగుతుంది. ఏమిటీ మానవ జీవితాలు? ఎప్పుడూ ఏవోరోగాలతో అలమటించాల్సిందేనా వీళ్లు! జీవ పదార్థంకంటే జడపదార్థమే నయమేమో అనే విరక్తిభావం నన్నావరిస్తుంది. అయితే అది క్షణికమే.

ఎవరికో తగ్గదనుకున్న జబ్బు నయమవుతుంది. అతని కళ్లల్లో వెలుగు. అతని కుటుంబం కళ్లల్లో కోటి వెలుగులు చూస్తానా, నాకూ సంతోషమొస్తుంది. వాళ్లు డాక్టర్లనూ, నర్సులనూ మెచ్చుకుంటుంటే కాసింత గర్వం కూడా కలుగుతుంది.

కె.వి.యస్.వర్మ ఫీచర్స్

అదేరోజునో, మర్నాడో ఎవడో గుండెపోటుతోనో కత్తివేటుతోనో చనిపోతాడు. అతని వెంట ఎవరూ రాకపోవడంతో మృతదేహాన్ని శవాలగదిలో పడేస్తారు. విషయం తెలిశాక, వాళ్ళవాళ్లు వస్తారు, శవాన్ని వాళ్లకివ్వడానికి ఎంత తతంగమో!

ఎంత డబ్బు గుంజుతారో, ఆ శవం తాలూకు వాళ్లకెంతో కోపమొస్తుందో, నాకూ అంతకంటే ఎక్కువ కోపమే వస్తుంది.

తిని కూర్చోలేక అన్నట్టు.... ఒకరి నొకరు కొట్టుకుంటారు. నరుక్కుంటారు. అందుకేదో కారణం వెదుక్కుంటారు. కుల ఘర్షణలు జరుగుతాయి. కొందరు అక్కడికక్కడే చనిపోతారు. మరికొందరు గాయాలతో నా దగ్గరికివస్తారు. అయినా కొందరు గాయాలతో మరణిస్తారు. ఇంకెందరో బతికీ వికలాంగులవుతారు. ఓ కాలుపోయో, చెయ్యిపోయో కన్నుపోయో 'ఎందుకు బతికించావు దేవుడా' అని దుఃఖిస్తారు. వాళ్ల దుఃఖం చూసి నాకూ దుఃఖమొస్తుంది.

ఆమధ్య అయోధ్యలో రామాలయం పేర మతం పడగ విప్పింది. దాంతో ఎన్నోచోట్ల ఘర్షణలు జరిగాయి. వందలమంది ప్రాణాలు కోల్పోయారు. వేలమంది గాయపడి నా దగ్గరకొచ్చారు. వాళ్ల పెడబొబ్బలతోనూ మూలుగులతోనూ నేను ప్రతిధ్వనించాను.

తల్లుల్ని కోల్పోయిన పిల్లల్నీ పిల్లల్ని కోల్పోయిన తల్లుల్నీ చూసి నేనూ ఓ అనాథనే అని బెంగ కలిగింది.

ఆ బెంగ నుంచి కొంత తేరుకునేటప్పటికి బొంబాయిలో బాంబుపేలుళ్లు........ భవనాలకు భవనాలు కుప్పకూలిపోయాయి. ఎందరో అమాయకులు అసువులు బాసారు. ఇంకెందరో గాయపడి నా దగ్గరికొచ్చారు. మళ్లీ నేను అతలాకుతలమైపోయాను.

నేనింకా తేరుకోకముందే మణిపూర్ మాయని మచ్చ అయింది. ఇంఫాల్ మత ఘర్షణల్లో వందలమంది బలి అయిపోయారు. ఇంకెంతమందో గాయపడ్డారు. నాకు కన్నీళ్లొచ్చాయి. కోపమూ వచ్చింది.

నా మందుల వాసనే మీకు అసహ్యం. నా అపరిశుభ్రతే మీకు అసహ్యం.

మరి మీ కులకొట్లాటలు చూసీ మత ఘర్షణలు చూసీ నేనింకెంత అసహ్యపడాలి?

ఇంకా మొహమాటం ఎందుకు? ఒకరినొకరు గాయపరుచుకునే తెగనరుక్కునే వాళ్లంటే నాకు పరమాతి పరమ అసహ్యం.

24.5.93

ఆంధ్రభూమి దినపత్రిక